క్లుప్తంగా

యోగా శిక్షణ ప్రారంభం

తుని: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో యోగాపై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. బ్రహ్మకుమారీస్ జిల్లా ఇంచార్జి రజని దీదీ యోగాపై శిక్షణ ఇచ్చారు. యోగాతో కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సుశీల, మాధవి లత, మాజీ ఎమ్మెల్యే రాజాఅశోక్ బాబు, సూర్య నారాయణ రాజు, దాసరి అప్పలరాజు, బ్రహ్మ కుమారీలు పాల్గొన్నారు

వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్


లంక ప్రసాద్

కోటనందూరు: వైఎస్సార్ సీపీ రైతు విభాగం కాకినాడ జిల్లా అధ్యక్షుడిగా కోటనందూరు మండలం కాకరాపల్లికి చెందిన లంక ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శుక్రవారం ఆదేశాలు వెలువడ్డాయి. తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఇన్‌చార్జ్ మంత్రి బొత్స సత్యనారాయణలకు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. రైతు విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన ప్రసాద్‌కు ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, తుని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వెలగా వెంకట కృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

బాలల అక్రమ రవాణాపై ఉక్కుపాదం


తుని రైల్వేస్టేషన్‌లో బాలల అక్రమ రవాణాపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

తుని: బాలల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో శుక్రవారం బాల కార్మికులు లేని రాష్ట్రం కార్యక్రమంలో భాగంగా బాలల అక్రమ రవాణా, బాలలపై వేధింపులు, బాల్య వివాహాల నివారణ తదితర అంశాలపై ఆటోవాలాలు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. బాలల సంరక్షణకు ఆర్పీఎఫ్, చైల్డ్‌లైన్ 1090 సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను వివరించారు. బాలల సంరక్షణ విషయంతో ఎవరు తప్పు చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ 1098 కోఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, సిబ్బంది ఎన్వీ లక్ష్మి, జి.క్రాంతిలాల్, రైల్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కిర్లంపూడి: సైబర్ నేరాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ సూచించారు. గెద్దనాపల్లి ప్రభుత్వోన్నత పాఠశాలలో సైబర్ నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రమాదాల నివారణపై అవగాహన


కత్తిపూడిలో ప్రమాదాల నివారణపై ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు

శంఖవరం: ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా రవాణా శాఖ కమిషన్ శ్రీధర్ సూచించారు. మండలంలోని కత్తిపూడి సీతారామా కళాశాలల్లో శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. రోడ్డు క్రాసింగ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యురాలు పద్మ, ప్రిన్సిపాల్ సీహెచ్ వీరబాబు, అధ్యాపకులు అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

కిర్లంపూడి: గ్రామాల్లో నాణ్యత ప్రమాణాలతో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నట్లు డీఈ వై.ఉమాశంకర్ తెలిపారు. మండలంలోని కిర్లంపూడి, జగపతినగరం, చిల్లంగి, సోమవరం, బూరుగుపూడి గ్రామాల్లో జరుగుతున్న సీసీ రోడ్లు, డ్రైన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ నిధులు సుమారు రూ.6 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

శిక్షణ.. అభివృద్ధికి రక్షణ

- సర్పంచులు, ఎంపీటీసీలకు జీపీడీపీపై శిక్షణా తరగతులు
- సద్వినియోగం చేసుకుంటే మెరుగైన ఫలితాలు


కిర్లంపూడిలో శిక్షణ పొందిన ప్రజాప్రతినిధులతో అధికారులు



ఏలేశ్వరం శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలకు శుక్రవారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ) తయారీపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీల్లో నిర్వహించాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల లభ్యత, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, స్థానిక పరిస్థితులను అన్వయించుకొని గ్రామాభివృద్ధి ఎలా సాధించాలి తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఎంపీడీఓ వెంకటనారాయణ మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జయరాం పాల్గొన్నారు.

ప్రధాన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలి

ఏలేశ్వరం: మండలంలో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రధాన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీఓ సూర్యనారాయణ అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం, రహదారులు, వీధిదీపాలు, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

రౌతులపూడి మండలంలో..

రౌతులపూడి: మండలంలోని గ్రామాల అభివృద్ధిపై శుక్రవారం ప్రజాప్రతినిధులకు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్‌డీ శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. గ్రామాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సంస్థాగత అభివృద్ధి, సహజ వనరుల యాజమాన్యం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంచనాలు సిద్ధం చేసుకోవాలి

గోకవరం: మండలంలోని గ్రామాల అభివృద్ధికి పంచాయతీల వారీగా ప్రజాప్రతినిధులు అంచనాలు సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవల్లి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులకు గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళికలను ఏ విధంగా సిద్ధం చేసుకోవాలి, వాటి ఆవశ్యకతను ఈఓపీఆర్డీ రాజేశ్వరరావు, ఇతర అధికారులు వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

కిర్లంపూడి: గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ తోట రవి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీటీసీలు, సర్పంచులకు గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు తోట గాంధీ, మహేంద్రాడ శ్రీలత, పాఠంశెట్టి కృష్ణమూర్తి, ఈఓపీఆర్డీ సత్యప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులను ఎంపీపీ ప్రారంభించారు. తొలుత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ కుమార్ బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. సమర్థవంతమైన అభివృద్ధి ప్రణాళికల తయారీలో పాటించాల్సిన నియమాలు, వనరుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ శిక్షణకు పంచాయతీ కార్యదర్శులు బి.రాజనాగేశ్వరరావు, ఎం.మధుసూదనరావు రీసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కేవీవీఎస్ కాశీవిశ్వనాథం, వెలుగు ఏపీఎం వై. వెంకట్, గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ కుమార్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్పంచులు, ఎంపీటీసీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చలగళ్ల దొరబాబు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు. తాగునీటి నిర్వహణ, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఎంపీడీఓ నాతి బుజ్జి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కుంచె రాజా, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

కళాశాల ప్రతిపాదనపై త్వరలో నివేదిక

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి


జిల్లా కలెక్టర్ ప్రశాంతికి వినతి పత్రం అందజేస్తున్న పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాము

గోకవరం: మండలంలోని భూపతిపాలెం గురుకుల పాఠశాలలో జూనియర్ కళాశాల ప్రతిపాదనపై త్వరలో అధికారుల బృందాన్ని పంపి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. భూపతిపాలెం గురుకుల పాఠశాలను శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. విద్యార్థుల సంఖ్య, వసతి సదుపాయం, తరగతి గదులను పరిశీలించారు. దీనిలో భాగంగా గురుకుల పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పేరెంట్స్ కమిటీ చైర్మన్ గల్లా రామచంద్రరావు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూనియర్ కళాశాల ఏర్పాటుపై త్వరలో అధికారులు పర్యటించి సమగ్ర నివేదిక ప్రభుత్వానికి నివేదిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, ప్రిన్సిపల్ బి.రవి ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు


మృతుడు గెల్లి శ్రీనివాసరావు (ఫైల్)


ప్రమాదస్థలంలో మోటార్‌సైకిల్, స్కూటీ

తొండంగి: జాతీయ రహదారిపై మండలంలోని బెండపూడి వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెండపూడి గ్రామానికి చెందిన గెల్లి శ్రీనివాసరావు(50) హైవేపై హోటల్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పెరుగు ప్యాకెట్ కోసం తారకరామా కాలనీ నుంచి బెండపూడి గ్రామంలోకి వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరాడు. బెండపూడి మెయిన్ సెంటర్‌లో జాతీయరహదారిని క్రాస్ చేస్తుండగా తుని మండలం ఎస్.సూరవరానికి చెందిన వి.వీరబాబు తన స్కూటీపై వస్తున్నాడు. ప్రమాదవశాత్తూ అదుపుతప్పి స్కూటీ, మోటార్ సైకిల్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావు, వి.వీరబాబు ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు రౌతులపూడి 108 అంబులెన్స్ సిబ్బంది పైలెట్ కె.సుధాకర్, ఈఎంటీ సీహెచ్.మహేశ్వరరావు వీరిద్దరికీ ప్రథమ చికిత్స అందించి తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతి చెందాడు. వీరబాబు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడికి భార్య వెంకటరత్నం, కుమార్తె చంద్రకళ, కుమారుడు మురళి ఉన్నారు. దీనిపై తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకలో ప్రసంగిస్తున్న డాక్టర్ సౌమ్య

ప్రత్తిపాడు: క్రీస్తుమార్గం అనుసరణీయమని ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ డాక్టర్ మైఖేల్ సౌమ్య అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో శుక్రవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. డాక్టర్ సౌమ్య కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నిమతాల సారాంశం ఒక్కటేనని, దేవుడి మీద నమ్మకం మనల్ని ఉన్నతంగా జీవించేలా చేస్తుందని అన్నారు. ఆసుపత్రి సిబ్బందికి వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సీహెచ్‌సీ సిబ్బంది శాంతాక్లాజ్ వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

తుని: స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చెన్నై మ్యాథమెటికల్ ఇనిస్టిట్యూట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మద్దాల సుందరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గణితం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం అంతర్జాతీయ గణిత విద్య, పరిశోధన సంఘం అధ్యక్షుడు ఎస్ఆర్ సంతానం, నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శివయ్య మాట్లాడారు. గణితం దైనందిన జీవితంలో ఒక భాగమని, ప్రతీ ఒక్కరూ గణితంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పెనుగొండ సుబ్బారావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

తొండంగి: మండలంలోని వేమవరం గ్రామానికి చెందిన స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. తొండంగి మండలంలోని పలు ప్రాంతాలతో పాటు తుని, పాయకరావుపేట, అన్నవరం పరిసర ప్రాంతాల్లో ఎటువంటి ఆశ్రయం లేకుండా రోడ్డు పక్కన జీవనం సాగిస్తున్న వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు, సభ్యులు నేమాల గోవిందు, అంబుజలపు నూకరాజు, గంపల శివ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి


కొత్తపల్లి రెవెన్యూ సదస్సులో అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

గోకవరం: గ్రామాల్లోని భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజల వద్ద నుంచి వచ్చే ఫిర్యాదులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొత్తపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ హాజరయ్యారు. గ్రామ ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు. ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ల్యాండ్ సీలింగ్ కేసులకు చెందిన అర్జీల పరిష్కారంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో డిసెంబర్ 12 నుంచి జనవరి 8 వరకూ రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సూచనలను అనుసరించి రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. గ్రామల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించే సమయంలో రెవెన్యూ, సర్వే అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయా గ్రామాలకు చెందిన భూ రికార్డులను అందుబాటులో ఉంచి, అర్జీదారులకు వివరాలు తెలియజేయాలని సూచించారు. జిల్లాలో గురువారం వరకూ 101 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. అర్జీలు పరిష్కారంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఈ సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ రెడ్డి, తాహసీల్దార్ ఎంవీ సాయిప్రసాద్, ఏడీఏ మల్లికార్జునరావు, మండలస్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రత్తిపాడు: భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు ప్రత్తిపాడు డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి తెలిపారు. మండలంలోని లంపకలోవలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు, ప్రజలు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని గుర్తించామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదుకు క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపుతామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 1బి ఫారం కోరిన ఐదుగురు రైతులకు అక్కడికక్కడే సర్టిఫికెట్లు అందజేశారు. భూములకు రీసర్వే జరిపించాలని, హద్దులు నిర్ణయించాలని, రేషన్ కార్డుల్లో పేర్లలో తప్పులు సరిచేయాలని కోరుతూ పలువురు దరఖాస్తులు అందజేశారు. రెవెన్యూ ఇనస్పెక్టర్ ఎ.గోపాలకృష్ణ, ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఉత్తరకంచి, లంపకలోవ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఉత్తరకంచిలో సర్పంచ్ మంతిన వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు రైతుల నుంచి 40 వినతులు అందాయి. లంపకలోవ గ్రామ సభలో రైతుల నుంచి మరో 15 వినతులను స్వీకరించినట్లు డిప్యూటీ తహసీల్దార్ పుణ్యవతి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాలకృష్ణ, గ్రామ పెద్దలు ఇళ్ల అప్పారావు, చక్కపల్లి భూరయ్య, రైతులు పాల్గొన్నారు.

రౌతులపూడి: మండలంలోని ములగపూడి, దిగువ ధారపల్లి, బలరామపురం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులకు 38 దరఖాస్తులు అందాయని డీటీ నరేష్ తెలిపారు.

కిర్లంపూడి: మండలంలోని ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి 3 అర్జీలు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

అంబేడ్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలకు నిరసన



ఏలేశ్వరంలో కళ్లకు గంతలు కట్టుకుని ఆందోళన చేస్తున్న లిబరేషన్ శ్రేణులు

ఏలేశ్వరం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా పట్టణంలో శుక్రవారం ఆందోళనలు నిర్వహించారు. సీపీఐ (ఎంఎల్)వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కళ్లకు నల్ల రిబ్బన్లతో గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లిబరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ కేంద్రమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రివర్గం బర్తరఫ్ చేయాలన్నారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, నాగులాపల్లి అర్జునుడు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక పాత బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పేకలజాన్, బత్తిన శ్రీను, వసంతయోహన్, మద్దెల రమణ, కాకర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం/తుని: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై లోక్‌సభలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు స్థానిక దళిత నాయకులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మెయిన్ రోడ్ నుంచి చినరావిచెట్టు వద్ద గల అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు ఆధ్వర్యంలో దళిత నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శెట్టిబత్తుల కుమారరాజా, దళిత నాయకులు సరమర్ల మధుబాబు, కొల్లాబత్తుల దిలీప్, తంతటి కిరణ్ కుమార్, జల్లు చినబాబు, ముఖే వీరబాబు, రాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. తునిలో సీపీఐ (ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

భూదేవి స్వరూపమే గోదాదేవి


ఏలేశ్వరంలో అధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ప్రవచన కర్త రోహిణి

ఏలేశ్వరం: భూదేవి స్వరూపమే కలియుగంలో గోదాదేవి రూపమని అధ్యాత్మిక ప్రవచన కర్త వాగు రోహిణి అన్నారు. స్థానిక సత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో భాగవతంలోని గోదాదేవి జన్మవృత్తాంతంపై ప్రవచనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీనివాసుని భక్తురాలిగా గోదాదేవి జన్మించిందని, తన భక్తితో శ్రీనివాసుని కృపను పొందినట్టు తెలిపారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

విశ్వహిందూ పరిషత్ అనుబంధ సంస్థలైన మాతృశక్తి, దుర్గావాహిణి నూతన కార్యవర్గాలను శుక్రవారం ఎన్నుకున్నారు. మాతృశక్తి అధ్యక్ష, కార్యదర్శులుగా గిరిజాకుమారి, సౌజన్య, ఉపాధ్యక్షురాలిగా సుగుణ, మంగామణి, సహాయ కార్యదర్శిగా లక్ష్మి, గౌరవ అధ్యక్షురాలిగా శారద, కోశాధికారిగా సూర్యాకుమారి, కార్యనిర్వహణ కార్యదర్శిగా పి.దేవి ఎన్నికయ్యారు. దుర్గావాహిణి సంఘ అధ్యక్ష, కార్యదర్శులుగా రేవతి, వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా సుజాత, హైమావతి సహాయ కార్యదర్శిగా సత్యవతి, గౌరవ అధ్యక్షురాలిగా లక్ష్మీకుమారి, కోశాధికారిగా కామాక్షి, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఇందిరాలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పరిషత్ ప్రతినిధులు కటకం కిరిటీ, ఏడీవీ ప్రసాద్, తూమురౌతు గురయ్య, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వైద్య సేవలు !

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిబ్బంది నిర్లక్ష్యంగా వైద్య సేవలు అందించారని బాధితుడి బంధువులు ఆరోపించారు. మండలంలోని ధర్మవరంలో బాలుడు తాతయ్య, అమ్మమ్మలు బి.గోపి, అన్నపూర్ణ తమ సమస్యను విలేకర్లకు వివరించారు. తమ మనమడు శివ ఏడాదిన్నరగా మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడని, ఈ క్రమంలో ప్రత్తిపాడు ఆసుపత్రికి తీసుకువెళ్లగా మొబైల్ వీడియో కాల్ చేసి డాక్టర్ల సూచనలతో వైద్యం చేశారన్నారు. వైద్యం వికటించి బాలుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాడని ఆరోపించారు. దీనిపై ప్రత్తిపాడు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సౌమ్యను వివరణ కోరగా బాలుడికి సిబ్బంది సక్రమంగా వైద్యం అందించారన్నారు.